క్లుప్తంగా

40 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ



ధాన్యం తరలింపును పరిశీలిస్తున్న ఏవో సుమంత

రాంబిల్లి : దిమిలి ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా సోమవారం 40 మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించినట్టు ఏవో సుమంత తెలిపారు. రైతులు ధాన్యం విక్రయించాలంటే ఆర్బీకేలను సంప్రదించాలని ఆమె సూచించారు. మండలంలో 1700 ఎకరాల్లో రబీలో వరి పంటను సాగు చేయగా ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా 500 మెట్రిక్ టన్నులు సేకరించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

ఫైలేరియా రోగులకు మెడికల్ కిట్‌ల పంపిణీ



తిమ్మరాజుపేటలో బోదకాలు వ్యాధి రోగులకు కిట్‌లు అందజేస్తున్న దృశ్యం

మునగపాక : ప్రతి ఒక్కరూ ఫైలేరియా వ్యాధి పట్ల జాగ్రత్తలు వహించాలని తిమ్మరాజుపేట సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి కోరారు. తిమ్మరాజుపేటలో సోమవారం ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు ఆమె మెడికల్ కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోదకాలు వ్యాధి సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్,ఏఎన్ఎం ప్రేమకుమారి,మెడికల్ అసిస్టెంట్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుడి కుటుంబానికి సాయం



నిత్యావసర వస్తువులు అందజేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని పూడిమడక శివారు పల్లెపేటకు ఎందిన వికలాంగుడు కంబాల అప్పలరాజు కుటుంబానికి శ్రీ స్వామి వివేకానంద వికలాంగుల అసోషియేషన్ అధ్యక్షుడు మేరుగు నూకరాజు ఆధ్వర్యంలో సోమవారం రూ.ఐదు వేల నగదు, నిత్యవసర వస్తువులు, కూరగాయలు అందజేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన అప్పలరాజు ఇంటికే పరిమితం కావడంతో వికలాంగుల సంఘం ద్వారా సహాయం అందజేశారు. మేరుగు సన్యాసిరావు, ఆనందరావు, మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలపై స్పందనలో ఫిర్యాదు



జేసీకి ఫిర్యాదు చేస్తున్న వైస్ ఎంపీపీ నానాజీ

నక్కపల్లి: మండల కేంద్రం నక్కపల్లిలో నెలకొన్న పలు రెవెన్యూ సమస్యలపై సోమవారం స్పందన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వీసం నానాజీ అనకాపల్లిలో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. నక్కపల్లిలో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్లో రహదారి సదుపాయం లేక లబ్దిదారులు ఇబ్బంది పడుతున్నారని, అలాగే సర్వే నంబరు 237లో భూములను 22ఏలో నమోదు చేసి ఎండోమెంట్‌భూమిగా చెబుతున్నారని, 22ఏ రిజిస్టర్లో నమోదు చేశారని నానాజీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చారు. నక్కపల్లి శ్మశాన వాటిక సరిహద్దులు నిర్ణయించి ఆక్రమణలు తొలగించాలని ఆయన తన ఫిర్యాదులో కోరారు.

పారిశుధ్యం మెరుగుకు సహకరించండి

కోటవురట్ల: జగనన్న స్వచ్ఛ సంకల్పానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ కోరారు. కె.వెంకటాపురంలో సోమవారం పారిశుధ్య పనులు నిర్వహించారు. పారిశుధ్య కార్మికులు వీధుల్లో చెత్తను సేకరించి డ్రైనేజీలు శుభ్రం చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామస్తులు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా నిర్దేశించిన ప్రదేశాలలో మాత్రమే వేయాలని కోరారు.

ఆగని ఇసుక అక్రమ రవాణా



పెనుగొల్లు శివారు తోటలో అక్రమంగా తరలించేందుకు రహస్య ప్రాంతంలో నిల్వ చేసిన ఇసుక బస్తాలు



సోమిదేవపల్లి సమీపంలో ఇసుక రవాణా కారణంగా ధ్వంసం అవుతున్న నదీ గర్భం

- రాత్రి వేళల్లో గుట్టుగా తరలింపు
- కొరవడిన నిఘా

ఎస్.రాయవరం : మండలంలో అక్రమ ఇసుక రవాణా ఆగకుండా జరుగుతోంది. పెనుగొల్లు సోమిదేవపల్లి, దార్లపూడి, పెదఉప్పలం, లింగరాజుపాలెం తదితర గ్రామాల్లో నిత్యం వరహా నుంచి పెద్ద ఎత్తున ఇసుక తవ్వుతున్నారు. ఇసుక తవ్వకాల వల్ల నదీ గర్భం ధ్వంసం అవుతోందని స్థానిక రైతులు చెబుతున్నారు. తవ్వకాలు చేసేటప్పుడు అక్రమార్కులు, నాటుబళ్లు, ఇసుక మూటలతో ఒడ్డుకు తరలించి రహస్య ప్రదేశాల్లో భద్రపరుస్తున్నారు. అలా భద్రపరచిన ఇసుక రాత్రి వేళల్లో ట్రాక్టర్లు,



దార్లపూడి వరహా నదిలో నాటుబళ్లు ఉపయోగించి నీటిలో నుంచి ఇసుక తీస్తున్న దృశ్యం

లారీలతో తరలిస్తున్నారు. కొందరు ట్రాక్టర్ యజమానులు ప్రభుత్వ ర్యాంపులో ఒక ట్రాక్టర్‌కి తీసుకున్న స్లిప్పు సహాయంతో అక్రమంగా ఇసుకను అదే రేటుకు వినియోగదారులకు అమ్ముతున్నారు. అక్రమంగా తరలించిన ఇసుక బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తూ జేబులు నింపుకొంటున్నారు. ఈ క్రమంలో స్థానిక అధికారులు, తనిఖీ చేసేవారిని లోబరుచుకుని అక్రమ ఇసుక రవాణా దర్జాగా సాగిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నారు. పోలీసు అధికారులు గత ఏడాది వరకు దార్లపూడి, పెనుగొల్లు జంక్షన్లలో చెక్‌పోస్టులు పెట్టి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకట్ట వేశారు. అయితే చెక్‌పోస్టులు ఎత్తివేయడంతో అక్రమ రవాణాదారులకు ఇపుడు వెసులుబాటు కలిగింది. ఇకనైనా ఇసుక రవాణా అడ్డుకట్ట వేసేందుకు సంబంధిత శాఖతో పాటు రెవెన్యూ, పోలీస్ శాఖ సిబ్బంది గట్టి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనన్నను గెలిపించాలి

ఎమ్మెల్యే కన్నబాబురాజు



ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

మునగపాక : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తి రాజు(కన్నబాబురాజు) అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన మునగపాకలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అలాగే ప్రభుత్వం ద్వారా నాలుగేళ్ల కాలంలో అందిన లబ్ధిని వివరిస్తూ మరిన్ని పథకాలు అందాలంటే వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. అలాగే జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. డ్వాక్రా మహిళలకు ఆసరా, విద్యార్థులకు అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, రైతులకు రైతు భరోసా తదితర పథకాలు అందజేస్తున్నామన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తీసుకువచ్చిన వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు సకాలంలో సేవలందుతున్నాయన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి గడపగడపకు మన ప్రభుత్వం దోహదపడుతుందన్నారు. గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, బోడకుర్తి గణేష్, పార్టీ నేతలు పిల్లి అప్పారావు, రామ్మోహనరావు, మళ్ల సంజీవరావు, పిన్నమరాజు వాసు, పొలిమేర గణేష్, ఆడారి కాశీబాబు, బొడ్డేడ మహేష్, పెంటకోట వెంకట్, ఆదినారాయణ, సూరిశెట్టి కన్నారావు, బొద్దపు శ్రీరామమూర్తితో పాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మునగపాకలో 'గడప గడపకు' నేడు

మునగపాక : మునగపాకలో మంగళవారం ఉదయం 6గంటల నుంచి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మునగపాక గౌరీ పరమేశ్వరుల ఆలయం నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమంలో ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్‌లు పాల్గొని ఇంటింటా ప్రచారం నిర్వహిస్తారన్నారు. పార్టీ నాయకులు,అధికారులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అచ్చియ్యనాయుడు కోరారు.

సీఎం కప్ విజేతలకు అభినందనలు



విజేతలను అభినందిస్తున్న దృశ్యం

నక్కపల్లి : ఇటీవల తిరుపతిలో జరిగిన సీఎం కప్ హాకీ టోర్నమెంట్‌లో ఉమ్మడి విశాఖ జిల్లా తరపున పాల్గొని బాలుర విభాగంలో ద్వితీయ స్థానం, బాలికల విభాగంలో తృతీయ స్థానం సంపాదించిన నక్కపల్లి బీఎస్ హాకీ క్లబ్ క్రీడాకారులను జిల్లా స్పోర్ట్స్ అధికారి నగిరెడ్డి సూర్యారావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ అభినందించారు. సోమవారం నక్కపల్లి ఉన్నత పాఠశాల మైదానంలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ నెల 1నుంచి 5వ తేదీ వరకు తిరుపతిలో రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా తరపున నక్కపల్లి హాకీ క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభ కనపరిచారన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన హాకీ క్లబ్‌లో క్రీడాకారులకు మంచి తర్ఫీదు ఇస్తున్నారన్నారు. ఇప్పటికే పలు జిల్లా, అంతర్ జిల్లా , రాష్ట్ర , అంతర్రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనపరుస్తున్నారన్నారు. ఈ విద్యార్థులకు పలు ప్రాంతాల్లో స్పోర్ట్స్ స్కూళ్లలో ఉచిత ప్రవేశాలు కూడా లభించాయన్నారు. జాతీయ క్రీడపై మక్కువ పెంచుకుని రాణిస్తున్న విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ క్రీడాకారులకు మంచి తర్ఫీదు ఇస్తున్న కోచ్ రాంబాబును ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, ఎస్ఎంసీ చైర్మన్ కర్రి పద్మ, హాకీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సూరిబాబు, కొల్నాటి తాతాజీ, పీడీ కుందూరు రాజు పాల్గొన్నారు.

విశ్వేశ్వరరాజు సేవలు మరువలేనివి



విశ్వేశ్వరరాజుకి శ్రద్ధాంజలి ఘటిస్తున్న అల్లూరి సీతారామరాజు సేవా సమితి సభ్యులు

ఎస్.రాయవరం : అల్లూరి సీతారామరాజు సేవా సమితికి దండు విశ్వేశ్వరరాజు అందించిన సేవలు మరువలేనివని సమితి అధ్యక్షుడు కలిదిండి సత్యనారాయణరాజు అన్నారు. విశ్వేశ్వరరాజు స్వగ్రామం లింగరాజుపాలెం గ్రామంలో సోమ వారం సీతారామరాజు సేవా సమితి సభ్యులు శ్రద్ధాంజలి ఘటించారు. విశ్వేశ్వరరాజు ఉద్యోగ రీత్యా కూడా దేశానికి అనేక సేవలందించి అవార్డులు సొంతం చేసుకున్నారన్నారు. కలిదిండి సన్యాసిరాజు, దండు అచ్చుతరామరాజు, బంగారురాజు, దండు అనంతరాజు పాల్గొన్నారు.

నేడు బంగారమ్మతల్లి, పైడితల్లి అమ్మవార్ల జాతరలు

ఎస్.రాయవరం : రేవుపోలవరం గ్రామంలో మంగళవారం బంగారమ్మతల్లి జాతర నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేశారు. రెండు గ్రామాలు రేవుపోలవరం, కొత్త రేవుపోలవరం నడుమ జరిగే ఈ జాతరకు భక్తులు ముఖ్యంగా మత్స్యకారులు అధికంగా తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా గ్రామంలో యువకులకు వాలీబాల్ పోటీలు ఏర్పాటు చేశారు. అదే క్రమంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అలాగే కొరుప్రోలు గ్రామంలో మంగళవారం పైడితల్లి అమ్మవారి జాతర నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సోమవారం అమ్మవారి శతకం పట్టు వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు.

టెన్త్‌లో మండల టాపర్లకు అభినందన



టెన్త్‌లో మండల టాపర్ షణ్ముక్‌ను అభినందిస్తున్న సుకుమారవర్మ, బొడ్డేడ ప్రసాద్



వెంకటదుర్గను సన్మానిస్తున్న ఎంపీపీ తదితరులు

మునగపాక : విద్యార్థులు ప్రణాళికాపరంగా చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ అన్నారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండల టాపర్‌గా నిలిచిన శరగడం షణ్ముక్‌ను సోమవారం ఆయన అభినందించారు. తోటాడ హైస్కూల్లో పదో తరగతి చదువుకున్న షణ్ముక్ 586 మార్కులు సాధించిన విషయం తెలిసిందే. దీంతో గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్‌తో కలిసి ఆయన అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు దొడ్డి బుజ్జి, బొడ్డేడ లిల్లీ, పిల్లి అప్పారావు పాల్గొన్నారు.

నక్కపల్లి : పదోతరగతి పరీక్ష ఫలితాల్లో 580 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిన నార్ని వెంకటదుర్గను ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, ఎంపీడీవో సీతారామరాజు సోమవారం అభినందించారు. డొంకాడ గ్రామానికి చెందిన వెంకటదుర్గ గొడిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివాడు. 580 మార్కులు సాధించి మండలంలో మొదటి స్థానంలో నిలిచాడు. అతనిని సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

కార్యక్రమంలో సర్పంచ్ చందిన కొండలరావు, స్కూల్‌కమిటీ చైర్మన్ రాజు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో ఈశ్వరరావు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థులకు ఉపయుక్తం



గ్రంథాలయంలో పుస్తకాలను ప్రదర్శిస్తున్న అతిథులు



అచ్యుతాపురం శాఖాగ్రంథాలయంలో..

పాయకరావుపేట : ప్రతి విద్యార్థి గ్రంథాలయా ల్లో నిర్వహించే వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి కె.ఎన్.గాంధీ తెలిపారు. పట్టణంలో గల శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ గ్రంథాలయాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం అన్నా రు. ప్రభుత్వం ఎంతో శ్రద్ధ వహించి విద్యార్థుల కు గ్రంథాలయాల్లో విజ్ఞాన శిబిరాలు ఏర్పాటు చేసి, చదవడం, క్విజ్, వక్తృత్వ పోటీలు, చిత్రలేఖనం వంటివి ఏర్పాటు చేసిందన్నారు. పురాణ ఇతిహాసాలు, మంచి కథలు వినడం ఎంతో మంచిదన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వి.లక్ష్మణరావు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు నరేష్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

మునగపాక : మునగపాక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులను సోమవారం ఎంఈవో వేణుగోపాలరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. మానసిక వికాసానికి తోడ్పాటునిచ్చే పుస్తకాలను చదవడం అలవరచుకోవాలన్నారు. హైస్కూల్ హెచ్ఎం సూర్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకొని మంచి ఫలితాలు సాధించేందుకు ఇటువంటి శిక్షణలు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. గ్రంథాలయాధికారి ఎల్.వి. రమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విశ్రాంత ఎంఈవో మోహనరావు, రిటైర్డ్ హెచ్ఎం పెంటకోట తులసీరావు, ఉపాధ్యాయులు సూర్యనారాయణ, జగదీష్, ఆశాదేవీ, వేసవి క్యాంప్ కన్వీనర్ శివకోటి దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండల కేంద్రమైన శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణా శిబిరాన్ని ఎంఈవో దేవరాయలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ అంశాలపై నిర్వహించే శిక్షణ శిబిరంలో విద్యార్థులు మెలకువలు సాధించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అచ్యుతా విద్యాసంస్థల అధినేత పల్లె శేషగిరిరావు, లైబ్రేరియన్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రాంబిల్లి: దిమిలి గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని లైబ్రేరియన్ ఎస్. శకుంతల ప్రారంభించారు. జూన్ 11 వరకు ఈ శిబిరం కొనసాగుతుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఆటలు, పాటలు, కథలతో ఉత్సాహంగా ఈ శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. దల్లమ్మదేవి, నూకినాయుడు పాల్గొన్నారు.

చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో...

నక్కపల్లి : మండలంలో చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో విద్యార్థుల కోసం వేసవి విజ్ఞాన శిబిరం ఏర్పాటు చేశారు. లైబ్రేరియన్ కె.జనార్దన్, నక్కపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు ఎన్.వి.ఎస్ ఆచార్యులు సోమవారం ఈ శిబిరాన్ని ప్రారంభించారు. సరస్వతి దేవి విగ్రహానికి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడుతూ గ్రంథాలయంలో విద్యార్థుల కోసం ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ శిబిరం ఆవశ్యకతను తెలియజేశారు. విద్యార్థులు జూన్ 11 వరకు నిర్వహించే ఈ శిబిరానికి వచ్చిన సద్వినియోగం చేసుకోవాలన్నారు. విజ్ఞానం వినోదానికి పోటీ పరీక్షలకు, జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన పుస్తకాలు ఈ గ్రంథాలయంలో అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు.

ఈ శిబిరంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు, క్విజ్ పోటీలు కూడా ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. అనంతరం గ్రంథాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ అప్పలరాజు, ఉపాధ్యాయులు శ్రీదేవి అప్పారావు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాడాలి

- మేడే ఉత్సవాల ముగింపు సభలో నరసింగరావు

మునగపాక : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం శరణ్యమని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు అన్నారు. గవర్ల అనకాపల్లిలో మేడే ఉత్సవాలు ముగింపు కార్యక్రమంలో ఆదివారం రాత్రి ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించాలని చూస్తే సహించేదిలేదన్నారు. ఎంతోమంది త్యాగధనుల పోరాట ఫలితంగా వచ్చిన స్వాతంత్య్రం అన్ని వర్గాల ప్రజలకు అందేలా ఉండాలన్నారు. వారం రోజుల పాటు మే డే ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. పలు ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి శ్రీనివాసరావు, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు రుత్తల శంకరరావు, ఐద్వా మహిళా సంఘ అధ్యక్షురాలు మాణిక్యం, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, కౌలు రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు కాండ్రేగుల రాము, సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీ కొయిలాడ వెంకట్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత షేక్ ఇస్మాయిల్ , సీపీఎం నాయకులు బ్రహ్మాజీ, జోగినాయుడు పాల్గొన్నారు.

సమీకృత దాణాకు ప్రత్యామ్నాయంగా అజోల్లా



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

మునగపాక : అజోల్లా పెంపకం ద్వారా అధిక పాలదిగుబడులు పెరుగుతాయని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు(కన్నబాబురాజు) అన్నారు. మునగపాక పశువైద్యాధికారి లావేటి ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోస్టర్‌ను ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమీకృత దాణాకు ప్రత్యామ్నాయంగా అజోల్లా నిలుస్తుందన్నారు. పశుపోషణ ఖర్చు తగ్గుతుందన్నారు. అజోల్లాను దాణాతో కలిపి వాడడం వల్ల పాల దిగుబడి పెరుగుతుందని, ప్రతి లీటర్ పైన రూ.10 వరకు లాభం వస్తుందని అన్నారు. కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నేతలు పిల్లి అప్పారావు, ఆడారి కాశీబాబు, ఎంపీటీసీ బోడకుర్తి గణేష్ పాల్గొన్నారు.

అకాల వర్షాలతో నువ్వుల రైతుకు తీవ్ర నష్టం



కైలాసపట్నంలో నీట మునిగిన నువ్వు పంట కుప్పలు

కోటవురట్ల : పంట అందొచ్చే సమయంలో అకాల వర్షం నువ్వుల రైతును నష్టాలపాలు చేసింది. మండలంలోని పలువురు రైతులు రబీలో వరికి బదులు నువ్వుల పంటను సాగు చేశారు. పంట కోత వరకు వాతావరణం అనుకూలించడంతో మంచి దిగుబడి వచ్చింది. కోతలు పూర్తయ్యాయి. కుప్పలు వేశారు. ఇంతలో అకాల వర్షం రైతుల ఆశలను నీరు కార్చేసింది. నువ్వుల పంట కుప్పలు నీట మునగడంతో తీవ్ర నష్టం వాటిలిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. మండలంలో కై లాసపట్నం, రాజుపేట, గొట్టివాడ, చౌడువాడ, సుంకపూరు, తంగేడు, పాములవాక, తిమ్మాపురం, లింగాపురం, బి.కె.పల్లి, చినబొడ్డేపల్లి, పి.కె.పల్లి, కె.వెంకటాపురం, కొడవటిపూడి తదితర గ్రామాలలో సుమారు 60 ఎకరాలలో నువ్వుల పంటను సాగు చేశారు. నాలుగు రోజులుగా కురిసిన కుండపోత వర్షానికి పంట పూర్తిగా నాశనమైంది. కైలాసపట్నం, రాజుపేట, లింగాపురం ప్రాంతాలలో నువ్వులు పంట కుప్పలు నీట మునిగాయి. మరికొన్ని చోట్ల పనలుగా ఉండగానే నీట మునిగి నష్టం వాటిల్లింది. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కోరుతున్నారు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని జెడ్పీటీసీ సిద్దాబత్తుల ఉమాదేవి తెలిపారు. వ్యవసాయాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని నమోదు చేయాలని కోరారు.

విద్యా సంస్కరణలతోనే ఉత్తమ ఫలితాలు



విద్యార్థులను మెమెంటోతో అభినందిస్తున్న మణిరాజు, హెచ్ఎం శ్రీనివాసరావు

నక్కపల్లి : విద్యావ్యవస్థలో జగనన్న ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంస్కరణల వల్లే పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనపరిచారని డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత అయినంపూడి మణిరాజు అన్నారు. వేంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పదో తరగతిలో ఈ ఏడాది అత్యుత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులకు పాఠశాలలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రమశిక్షణతో చదువుతూ ప్రతిభ కనపరిస్తే ఉన్నత స్థాయికి చేరుకోగలుగుతారన్నారు. 10 మంది విద్యార్థులు 550 నుంచి 561 మార్కులు వరకు సాధించారని, పాఠశాల చరిత్రకే గర్వకారణమన్నారు. వారందరికీ మెమెంటోలు, మిఠాయిలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఏడిద సూర్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామాలయం నిర్మాణానికి ఎమ్మెల్యే రూ.2 లక్షల విరాళం



దళితవాడలో రామాలయం నిర్మాణానికి సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

మునగపాక : మునగపాక దళితవాడలోని రామాలయం నిర్మాణానికి ఎమ్మెల్యే కన్నబాబురాజు సోమవారం రూ.2 లక్షల విరాళం అందజేశారు. ఆలయం పునర్నిర్మాణంలో భాగంగా గతంలో ఆలయ అభివృద్ధికి రమణమూర్తిరాజు రూ.5 లక్షల విరాళం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇటీవల రెండు దఫాలుగా రూ.3 లక్షలు అందించారు. మిగిలిన రూ.2 లక్షలను ఆలయ కమిటీకి సోమవారం అందజేశారు. ఆలయ అభివృద్ధి పనులు వేగవంతం చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, సర్పంచ్ దిమ్మల అప్పారావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు, కాలనీ వాసులు పిల్లి అప్పారావు, దిమ్మల నూకరాజు, ఎంపీపీ జయలక్ష్మి, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ పాల్గొన్నారు.

పంట కాలువలో పూడిక తొలగింపు

ఎస్.రాయవరం: మండల కేంద్రంలో పంటకాలువలో పేరుకుపోయిన పూడిక తొలగింపునకు చర్యలు చేపట్టారు. గ్రామంలో డ్రైనేజీ నీరు గ్రామం మధ్య గల పంటకాలువలో చేరి పేరుకుపోతుంది. కొన్నేళ్లుగా ఈ సమస్య పీడిస్తోంది. ఆ ప్రాంతంలో కాలువకు కాంక్రీట్ వాల్ కట్టి నీటి ప్రవాహానికి ఆటంకం తొలగిస్తామని అధికారులు చెప్పినా పనులు జరగలేదు. కాలువలో పేరుకుపోయిన చెత్త, మురుగు తొలగించేందుకు ఎప్పటికప్పుడు పంచాయతీ సిబ్బంది పనులు చేస్తుంటారు. ఈ క్రమంలో సోమవారం నుంచి కాలువలో పూడిక తొలగింపు పనులు చేపడుతున్నట్టు ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు.

పుస్తక పఠనంతో ఎంతో విజ్ఞానం

కోటవురట్ల: గ్రంథాలయాల ద్వారా ఎంతో విలువైన సమాచారాన్ని తెలుసుకోవడమే కాకుండా విజ్ఞానాన్ని సంపాదించుకోవచ్చని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.కొండబాబు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు సెలవుల్లో సమయాన్ని వృధా చేయకుండా పుస్తక పఠనం చేయాలన్నారు. పుస్తక పఠనం జ్ఞానాన్ని ఇవ్వడమే కాకుండా చదువు పట్ల శ్రద్ధ కలుగుతుందన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే అన్ని పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉంటాయని, ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అప్పలనాయుడు, ఈవోపీఆర్డీ ప్రేమ్ సాగర్, ఉపాధ్యాయులు జె.వి.ప్రసాదరావు, ఎస్.కె.మస్తాన్, వి.రాజేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.